క్లుప్తంగా

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

హొళగుంద: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎస్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో బుధవారం హొళగుంద సిద్ధేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ముగ్గులు పోటీలు జరిగాయి. విజేత నర్మదకు రూ.5 వేలను షాలి షబ్బీర్, రెండో బహుమతి విజయభారతికి రూ.3 వేలు, మూడో స్థానంలో నిలిచిన విజయలక్ష్మికి రూ.2 వేలను ఎంపీడీఓ దాసానాయక్, డీటీ దీప చేతుల మీదుగా అందజేశారు. పోటీల్లో పాల్గొన్న మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అవ్వ బ్యాంక్ డైరెక్టర్ ఆర్‌ఎంజీ రెడ్డి, టీచర్ సురేంద్రగౌడ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోహర్, ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం వేగవంతం చేయండి

నందవరం: ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ వేగవంతం చేయాలని తహసీల్దార్ నిత్యానందరాజు సూచించారు. ఆయన బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓకు సంబంధించి గరుడ యాప్‌లో ఆధార్ అనుసంధానం కాని ఓటర్ల జాబితా ఉందని, తద్వారా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. 2023 సంవత్సరానికి సంబంధించి ఓటర్ల జాబితాను బీఎల్‌ఓలకు అందిచామన్నారు. మండలంలో 45,709 మంది ఓటర్లకు గానూ 33,255 మంది ఓటర్లకు ఆధార్ అనుసంధానం పూర్తయ్యిందన్నారు. ఇంకా 12,454 మందికి పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. ఓటర్ జాబితాల్లో పేర్లు, ఫోటోలు, అడ్రస్ తప్పుగా ఉంటే సంబంధిత దరఖాస్తులను ఆయా గ్రామాల్లోని బీఎల్‌ఓలకు అందజేయాలని చెప్పారు. డీటీ రఘువీరా, ఆర్‌ఐ జనార్దన్‌రావు పాల్గొన్నారు.

నేడు జీజీఎంపీ కార్యక్రమం

ఆలూరు: దేవనకొండ మండలం ఐరన్‌బండ గ్రామంలో గురువారం ఉదయం 10 గంటలకు, గుమ్మరాళ్ల గ్రామంలో 12 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గౌరీదేవి బుధవారం తెలిపారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పాల్గొననున్నారని, అని శాఖలు అధికారులు, స్థానిక నాయకులు హాజరుకావాలని కోరారు.

పత్తికొండ రూరల్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గురువారం మండల పరిధిలోని జివరాళ్లమల తండాలో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కారం నాగరాజు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

17 నుంచి దేవర

తుగ్గలి: మండల పరిధిలోని ఎద్దులదొడ్డిలో వెలసిన సుంకులమ్మ, మారెమ్మవ్వ దేవర ఉత్సవాలు ఈనెల 17 నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు బుధవారం గ్రామస్తులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 17న అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, 18 బోనాల సమర్పణ ఉంటుందని వెల్లడించారు.

నేడు క్రికెట్ టోర్నీలు

వెల్దుర్తి: మండల పరిధిలోని నార్లాపురం (వెంకటాపురం) గ్రామంలో, మండల కేంద్రంలోని బాలుర హైస్కూల్ మైదానంలో గురువారం సూపర్-8 టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్లు జరుగనున్నాయి. నార్లాపురం పెనికలపాటి అనిల్‌చౌదరి తన తల్లి రేణుక జ్ఞాపకార్థం టోర్నీ నిర్వహిస్తూ విజేతలకు రూ.10,016, రూ.5,016 బహూకరించనున్నారు. పాల్గొనదలచిన క్రీడాకారులు 90001 11961, 86889 97894 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అలాగే వెల్దుర్తిలో గేట్‌మెన్ వెంకట్రాముడు, ఆయన మనుమడు హర్షవర్ధన్ నాయుడు జ్ఞాపకార్థం నిర్వహించే టోర్నీ విజేతలకు వరుసగా రూ.10 వేలు, రూ.5 వేలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పాల్గొనదలచిన వారు 95333 35750, 62818 83004 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

15లోగా ఈ-కేవైసీ పూర్తి చేయాలి



కప్పట్రాళ్ల ఆర్బీకేలో సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్

ఆలూరు: పత్తికొండ వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఈ కేవైసీ, ఈ-క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలని ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని కప్పట్రాళ్ల, మాచాపురం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలలో పనిచేస్తున్న సిబ్బంది పనితీరును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీలోగా రైతులచే ఈ-కేవైసీ నమోదు చేయించాలని, లేకపోతే పీఎం కిసాన్ నగదు రైతుల బ్యాంకు ఖాతాల్లోకి జమకాదన్నారు. రబీ పంటలను ఈ-క్రాప్ బుకింగ్ చేయాలని ఆదేశించారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- మద్దికెరలో గడప గడపకు మన ప్రభుత్వం



మద్దికెరలో లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మద్దికెర: ప్రజల కష్టాలు తెలుసుకొని వారి సంక్షేమ కోసం పథకాలు అమలు చేస్తూ, పేదరిక నిర్మూలనే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం సచివాలయం-4 పరిధిలోని మోమిన్, బసవన్న గుడి ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. గత మూడన్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. గ్రామస్తులు పలు సమస్యలతో పాటు ఇంటి స్థలాలు కావాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సంక్రాంతి పండుగ తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు అందిస్తామన్నారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక పేటా స్కూలులో విద్యార్థులను పలకరించి పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, యూనిఫాం ఇచ్చారా అని అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ దేవిరెడ్డి మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ డీఎస్ అనితాయాదవ్, సర్పంచ్ బండారు సుహాసిని ఎంపీడీఓ నరసింహమూర్తి, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, హౌసింగ్ ఏఈ ఉమాకాంత్, ఏపీఓ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మమ్మవ్వను దర్శించుకున్న ఎమ్మెల్యే

మండలంలోని హంప గ్రామంలో దేవర ఉత్సవంలో ఎమ్మెల్యే శ్రీదేవి పాల్గొని లక్ష్మమ్మ అవ్వను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఎమ్మెల్యేను సాదరంగా ఆహ్వానించారు. పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలు బలిగొంటే చూస్తూ ఊరుకోం

అనువుగాని చోట సభలు పెట్టి అమాయక ప్రజల ప్రాణాలు బలిగొంటే చూస్తూ ఊరుకోబోమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ప్రజల భద్రత ప్రభుత్వం బాధ్యత అని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను కాపాడుకునేందుకు జీఓ-1 తెచ్చారని స్పష్టం చేశారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు వన్నాల గోవిందు స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాటారు. స్థలం లేని చోట సభలు నిర్వహించి కందుకూరులో 8 మంది, గుంటూరులో ముగ్గురు, గతంలో ప్రచార పిచ్చితో కృష్ణా పుష్కరాల్లో 29 మంది మరణానికి కారణమైన టీడీపీ నాయకుడు చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో గెలవలేమనే నిరాశ, నిస్పృహలతో పిచ్చి పట్టినట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. అనువైన చోట సభలు, సమావేశాలు నిర్వహించుకుంటే తమకు అభ్యంతరం లేదని తెలిపెచ్చారు. ఇరిగేషన్ శాఖ కమిటీ డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ డీఎస్ అనితాయాదవ్, మల్లికార్జున పాల్గొన్నారు.

ప్రతిరోజూ 'స్పందన' నిర్వహించాలి



వెల్దుర్తి-1 సచివాలయంలో ఉద్యోగులకు సూచనలు చేస్తున్న డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి

వెల్దుర్తి: గ్రామ సచివాలయాలలో ప్రతిరోజూ సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని, ఆ సమయంలో ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని కర్నూలు డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లె, వెల్దుర్తి-1, రత్నపల్లె, లక్ష్మీనగరం గ్రామ సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, ఉద్యోగుల హాజరు పరిశీలించారు. మండలంలో ఆయుష్మాన్ భారత్ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ సేవలు మెరుగుపరచాలన్నారు. వెల్దుర్తి-1 సచివాలయంలో స్పందనకు హాజరై అర్జీలను పరిశీలించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు వెంట ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి భూమిపూజ



కే.పేటలో భూమిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

నందవరం: మన బడి నాడు- నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడులకు మహర్దశ పట్టిందని వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కే.పేట ఎంపీపీ పాఠశాలలో ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాడు-నేడు పనులకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 5 అదనపు గదుల నిర్మాణానికి రూ.60 లక్షలు, మరమ్మతులకు రూ.24 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. పనులను నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎంపీడీఓ కృష్ణమూర్తి, పీఆర్ ఏఈ జయన్న, పీఎంసీ చైర్మన్ గురుస్వామి, నాయకులు ఉదయ్‌కుమార్‌గౌడ్, డీలర్ ఈరన్న, భీమన్నగౌడ్, హెచ్‌ఎం దేవసహాయం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల హాజరు పెంచాలి



మాట్లాడుతున్న ఏపీడీ అల్లిపీరా

నందవరం: గ్రామాల్లో ఉపాధి కూలీల హాజరు పెంచాలని ఏపీడీ అల్లిపీరా ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య పెంచాలన్నారు. ప్రతి కుటుంబానికి 100 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. రోజుకు రూ.257 వేతనం అందేలా చూడాలన్నారు. అలాగే ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పించి పండ్ల తోట పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. ఈ నెలలో నిర్వహించే సామాజిక తనిఖీ(సోషల్ ఆడిట్) నివేదికకు రికార్డులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం పూర్తి చేయాలన్నారు. ఏపీఓ మాలిక్‌బాషా, ఈసీ నూర్జహాన్, సీడీసీఎల్ ఆర్సీ టీఏ బషీర్ పాల్గొన్నారు.

తుగ్గలి: వ్యవసాయ పనులు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో కూలీలు వలస వెళ్లకుండా అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలని ఏపీడీ రామకృష్ణ సూచించారు. స్థానిక ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పని కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఉపాధి పని కల్పించాలన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

గోనెగండ్ల: గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూ హక్కు-భూ రక్ష పథకంలో భాగంగా రీసర్వే పకడ్బందీగా చేపట్టాలన్నారు. గోనెగండ్ల మండలంలో 8 గ్రామాల్లో భూ సర్వే పనులు పూర్తయ్యాయని, రైతులకు భూ హక్కు పత్రాలు కూడా పంపిణీ చేసినట్లు చెప్పారు. మరో 8 గ్రామాల్లో సర్వే పనులు జరుగుతున్నాయని తెలిపారు. సర్వే పక్కాగా చేపట్టేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. రీసర్వేలో ఏమైనా సమస్యలుంటే తహసీల్దార్ దృష్టికి తీసుకురావాలన్నారు. తహసీల్దార్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించండి

ఆలూరు రూరల్/చిప్పగిరి: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం వడ్డించాలని కర్నూలు జిల్లా ఐసీడీఎస్ పీడీ కేఎల్‌ఎన్ కుమారి సూచించారు. ఆమె బుధవారం ఆలూరు ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రాజెక్టు పరిధిలోని ప్రీ స్కూల్ పిల్లల హాజరు, సిలబస్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత లోపం రాకుండా ప్రతి రోజు అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం అనంతరం ఐరన్, క్యాల్షియం మాత్రలు అందించాలని సూచించారు. అనంతరం చిప్పగిరి మండలంలోని 1, 4 అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పిల్లలకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆలూరు సీడీపీఓ లలిత, సూపర్‌వైజర్ ప్రసూన తదితరులు ఉన్నారు.

పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం చేయొద్దు

ఆలూరు: మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో ఇంటి, నీటి పన్ను వసూళ్లను మార్చి నెలాఖరుకల్లా పూర్తి చేయాలని ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు ఆదేశించారు. ఆయన బుధవారం ఈఓ కృష్ణకుమార్ సమక్షంలో ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో వివిధ గ్రామాల పీఎస్‌లు, బిల్ కలెక్టర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆలూరు పంచాయతీలో 4,083 గృహాల నుంచి రూ 20,82,894, షాపింగ్ కాంప్లెక్సుల నుంచి రూ.13 లక్షలు, పన్నేతర సేవలకు రూ.5,28,750, మైనర్ గ్రామ పంచాయతీల నుంచి రూ.30 లక్షలు వసూలు చేయాల్సి ఉందన్నారు. పెండింగ్ బకాయిలపై దృష్టి పెట్టి వసూళ్ల వేగవంతం చేయాలని సూచించారు.

రెవెన్యూ సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

కృష్ణగిరి: గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలపై వీఆర్వోలు అప్రమత్తంగా ఉండి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పురుషోత్తం ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పొలాలకు సంబంధించిన సమస్యలపై నిత్యం రైతులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని, సమస్యలను పూర్తిస్థాయిలో విచారించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. భూములకు సంబంధించి రికార్డుల ఆధారాలతో దరఖాస్తు ఉంటేనే ఆమోదిస్తామన్నారు. ముఖ్యంగా రీసర్వే పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఆర్‌ఐ మస్తాన్, సిబ్బంది మనోహర్‌రావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

క్రీడా పండుగ



ఫుట్‌బాల్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈఓ రంగారెడ్డి



బాలికల వాలీబాల్ విజేత బెంగళూరు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: నీలకంఠేశ్వర స్వామి జాతర మహోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు క్రీడలతో పట్టణంలోని వైడబ్ల్యూసీఎస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, ఇండోర్ స్టేడియంలో పండుగ వాతావరణం నెలకొంది. వైఎస్సార్ అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్, పురుషుల, మహిళల వాలీబాల్, కబడ్డీ, వృషభాల బలప్రదర్శన పోటీలతో పాటు దాదాపు 40 రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లు క్రీడాభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. క్రికెట్ టోర్నమెంట్ ఇప్పటికే ముగియగా మిగతా పోటీలు కొనసాగుతున్నాయి. కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలనుంచి వచ్చిన క్రీడా జట్లు పాల్గొంటున్నాయి. విజేతలకు భారీగా నగదు బహుమతులు ఉండటంతో పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. పలు కేటగిరీల వృషభాల బండలాగుడు పోటీలకు రాష్ట్రం నుంచే గాక తెలంగాణ, కర్ణాటక నుంచి 65 జతల వృషభాలు వచ్చాయి. ఫుట్‌బాల్ పోటీలకు 48 జట్లు, వాలీబాల్ పోటీలకు 30 పురుషుల జట్లు, 8 మహిళల జట్లు, కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు 60 జట్లు వచ్చాయి. పోటీలను తిలకించేందుకు పట్టణ వాసులేకాకుండా వివిధ ప్రాంతాల నుంచి ప్రతిరోజు మైదానాలకు క్రీడాభిమానులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. పోటీలు మరో రెండు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఆర్గనైజర్లుగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, భీమిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, విశ్వనాథ్ రమేష్, బాబుఖాన్, రామకృష్ణ వ్యవహరిస్తున్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. క్రీడా మైదానాల్లో పట్టణ, రూరల్ సీఐలు మధుసుదన్‌రావు, మంజునాథ్, ఎస్‌ఐలు మస్తాన్‌వలి, వెంకటసురేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

క్రీడాకారులు ప్రతిభ చాటాలి

క్రీడాకారులు తమలో దాగి ఉన్న ప్రతిభను చాటుకునేందుకు టోర్నమెంట్‌లు ఎంతో ఉపయోగపడతాయని డీఈఓ రంగారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఫుట్‌బాల్, వాలీబాల్ పోటీలను మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వక్ఫ్‌బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, వైఎస్‌ఆర్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, ఆర్గనైజర్ విశ్వనాథ్ రమేష్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. తాను ఇక్కడి ప్రభుత్వ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేసినట్లు తెలిపారు. ఆర్గనైజర్లు డీఈఓను సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

మహిళా వాలీబాల్ విజేత బెంగళూరు జట్టు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గత రెండు రోజులుగా నిర్వహించిన వైఎస్సార్ అంతర్రాష్ట్ర మహిళా వాలీబాల్ టోర్నమెంట్‌లో బెంగళూరు జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి ట్రోఫీతో పాటు రూ.15,116 నగదు బహుమతి అందజేశారు. రన్నర్‌గా నిలిచిన కర్నూలు జట్టుకు రూ.10,016, మూడో స్థానంలో నిలిచిన ఉత్తర కర్ణాటక జట్టుకు రూ.5,016, నాల్గవస్థానంలో నిలిచిన కర్నూలు బీ టీంకు రూ.3016 అందజేశారు.

కబడ్డీ విజేత వైజాగ్ వారియర్స్

స్థానిక ఇండోర్ స్టేడియంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న వైఎస్సార్ అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీల్లో బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విశాఖకు చెందిన వైజాగ్ వారియర్స్ జట్టు విజేతగా నిలిచింది. ఆ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.60 వేల నగదు బహుమతిని ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అందజేశారు. రన్నర్‌గా నిలిచిన ఎమ్మిగనూరు బుల్స్ బుల్లెట్ జట్టుకు రూ.40 వేలు, తరువాతి స్థానాల్లో నిలిచిన ప్యాపిలి జట్టుకు రూ.20 వేలు, గంజిహళ్లి జట్టుకు రూ.10 వేలు, ఎమ్మిగనూరు కబడ్డీ అసోసియేషన్ జట్టుకు రూ.5 వేలు, కర్నూలు స్టేడియం జట్టుకు రూ.3 వేలను అందజేశారు.

పీహెచ్‌సీ సిబ్బందిపై అసహనం

హొళగుంద: హొళగుంద పీహెచ్‌సీ పరిస్థితి, సిబ్బంది నిర్లక్ష్యం తదితర వాటిపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి పేర్కొన్నారు. బుధవారం పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఆమె ఆస్పత్రిలో నెలకొన్న సంఘటనలు, డాక్టరు, ఫార్మసిస్ట్ మధ్య విభేదాలు, మరో వైద్యుడు అందుబాటులో లేకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వైద్య సిబ్బందితో విడివిడిగా మాట్లాడి రికార్డులు పరిశీలించి పలు విషయాలపై వారిని మందలించారు. అయినా వారి మధ్య సయోధ్య కుదరని పరిస్థితి, రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం, సమయపాలన పాటించకపోవడం, విధుల్లో నిర్లక్ష్యం తదితర విషయాల్లో తీవ్ర అసహనానికి గురైన ఆమె పీహెచ్‌సీలో పరిస్థితులపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని తదుపరి చర్యలు వారు తీసుకుంటారని చెప్పారు.

సీసీ రోడ్డు నిర్మాణం

ఆలూరు రూరల్: మండలంలోని మూసానహళ్లి గ్రామంలో రూ.10 లక్షలతో ఆదివారం సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామ సచివాలయానికి కేటాయించిన రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు సర్పంచ్ పార్వతి తెలిపారు.

విజేత గొర్లఖాన్‌దొడ్డి వృషభాలు

రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరు పళ్ల వృషభాల ఎద్దుల బండలాగుడు పోటీల్లో తెలంగాణ రాష్ట్రం, గట్టు మండలం గొర్లఖాన్‌దొడ్డి పల్లె వృషభాలు విజేతగా నిలిచాయి. వృషభాల యజమాని కురువ కర్రెప్పకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి రూ.40 వేల నగదు బహుమతి అందజేశారు. పాలూరు పెద్ద మునియం వృషభాలు, రోళ్లపాడుకు చెందిన వృషభాలు సమంగా రెండో స్థానంలో నిలవడంతో వాటి యజమానులు రాచమల్లు సుధీర్‌కుమార్ రెడ్డి, పేరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలకు, మూడో స్థానంలో నిలిచిన వైఎస్సార్ జిల్లా ఎస్.కొత్తూరుకు చెందిన బీరం బుల్స్ యజమానికి. నాల్గవ స్థానంలో రెండు జతల వృషభాలు సమంగా నిలవడంతో వాటి యజమానులైన వైఎస్సార్ జిల్లా పెద్దచీపాడు వీరతేజారెడ్డి, పాములపాడు మండలం తుమ్మలూరు తెలుగు పల్లవికి, ఐదో స్థానంలో నిలిచిన తుగ్గలి మండలం పెండేకల్లు వృషభాల యజమాని నాగభూషణంకు నగదు బహుమతులు అందజేశారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

హొళగుంద: చిప్పగిరి మండలం రామదుర్గం గ్రామానికి చెందిన కోటి, మరో ఏడుగురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అబ్దుల్‌జహీర్ బుధవారం తెలిపారు. ఇంగళదహాల్ గ్రామానికి చెందిన జయలక్ష్మితో కోటికి తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. దంపతులకు సంతానం కలగలేదు. దీంతో భర్త కోటి, అతని కుటుంబ సభ్యులు జయలక్ష్మిని అదనపు కట్నం కోసం వేధించడంతో పాటు, మరో వివాహం చేసుకున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు 8 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోలుకోలేక యువకుడి మృతి



ఖాసీం బాషా (ఫైల్)

ఆలూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు కోలుకోలేక మృతి చెందాడు. వివరాలు.. ఆలూరుకు చెందిన ఖాసీం బాషా (28) ఓ కొరియర్ సంస్థలో డెలివరీ బాయ్‌గా పనిచేసేవాడు. వృత్తిలో భాగంగా ఆదివారం ఉదయం హాలహర్వి మండలం గూళ్యం గ్రామానికి పార్సిల్ ఇవ్వడానికి వెళ్తుండగా.. ఆలూరు సమీపంలోని హైవే-167లో మారెమ్మ దేవాలయం వద్ద ట్రాక్టర్ (ఏపీ 21 టీజెడ్ 7618) పొలాల రస్తా నుంచి మట్టిలోడుతో హైవేపైకి వస్తూ స్కూటర్‌ను ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఖాసీం బాషా మూడు రోజులుగా బళ్లారి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఖాసీం బాషాకు భార్య మెహరూన్, రెండు నెలల వయసున్న కూతురు ఉంది.

భవన నిర్మాణాలు వేగవంతం చేయండి

నందవరం: ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి ఏజెన్సీలకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని కనకవీడు, కే.పేట గ్రామాల్లో రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులను పీఆర్ ఏఈ జయన్నతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. మండలంలో 53 ప్రభుత్వ భవన నిర్మాణాలు చేపట్టామన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు భరత్, లక్ష్మణ్ ఉన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ సుభాష్‌చంద్రబోస్

పత్తికొండ రూరల్: గ్రంథాలయాల్లో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి అభివృద్ధికి కృషి చేస్తానని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్దూరు సుభాష్‌చంద్రబోస్ అన్నారు. బుధవారం పత్తికొండలోని గ్రంథాలయంలో లైబ్రేరియన్ రాంకుమార్ అధ్యక్షతన 'గ్రంథాలయాల అభివృద్ధి-ప్రజల భాగస్వామ్యం' అనే అంశంపై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి మాజీ మండలాధ్యక్షురాలు ఎస్.నాగరత్నమ్మ, సర్పంచ్ కొమ్ముదీపిక, ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ మాధురి, ఎంఈఓ మస్తాన్‌వలి, ప్రముఖ కవులు మహబుబ్‌బాషా, సవ్వప్పగారి ఈరన్న, తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. భావితరానికి విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పలువురు కవులు రచించిన పుస్తకాలను గ్రంథాలయానికి విరాళంగా అందజేశారు. చైర్మన్ గ్రంథాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి చూపాలి

చిప్పగిరి: మండలంలో జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని స్పెషల్ ఆఫీసర్ శ్రీరాములు గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. నిర్మాణాల్లో పురోగతి ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. సూపరింటెండెంట్ సుధాకర్ రాజు, ఈఓపీఆర్డీ సంజన్న,పీఎస్‌లు, ఈఏలు పాల్గొన్నారు.

ఆలూరు: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు గృహ నిర్మాణాలు వేగవంతం చేసేలా ఏఈలు, సచివాలయ ఈఏలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ డీఈ ఆదినారాయణ ఆదేశించారు. హాలహర్వి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఆంటోని ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించిన గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించడంపై సూచనలు చేశారు.

భక్తిశ్రద్ధలతో దేవర

ఆస్పరి: మండలంలోని అట్టేకల్లులో కొలువుదీరిన గ్రామదేవత బంగారమ్మ దేవరను బుధవారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి గంగ, ఆకు పూజలతో పాటు కుంకుమార్చన, ఫల, పుష్ప అలంకరణ చేసి మహామంగళ హారతి చేశారు. ప్రతి ఇంటి నుంచి కుంభాలను మేళతాళలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచండి

కృష్ణగిరి: గ్రామాలు శుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ మోహన్‌కుమార్ అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల శుభ్రతతోపాటు, ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. తాగునీటి పైపుల లీకేజీల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తుగ్గలి: జొన్నగిరి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల ఏఈ మహేశ్వరరెడ్డి తెలిపారు. నూతన ఫీడర్ ఏర్పాటు, సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపి వేస్తున్నట్లు చెప్పారు.

వడ్డె ఓబన్నకు నివాళి

హొళగుంద: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని వడ్డెర సేవా సమితి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం హొళగుంద, వందవాగిలి, ఎల్లార్తి, గజ్జహళ్లి, ఎండీ హళ్లి తదితర గ్రామాలలో వడ్డె ఓబన్న జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆ సంఘం అధ్యక్షుడు ఎర్రిస్వామి, నాయకులు మాట్లాడుతూ.. వడ్డెర్లను ఎస్టీ జాబితాల్లో చేర్చాలని, హొళగుందలో విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని కోరారు.

బావిలో పడి వ్యక్తి మృతి

మద్దికెర: స్థానిక కొండమ్మ బావిలో మద్యం మత్తులో పడి రామాంజులు (45) మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. జెండా కట్ట వీధిలో తల్లి పాపక్క, రామాంజులు నివాసం ఉంటున్నారు. రామాంజులు ప్రతిరోజు బావిలో స్నానం చేసేందుకు వస్తుంటాడని, మద్యం మత్తు ఉండడంతో కాలు జారి పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు.